
సాక్షి పెద్దపల్లి

బుధవారం । 22 । మార్చి । 2023



సాగు నీరు.. విద్యుత్ ఉత్పత్తి

జూలపల్లి: జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఎస్సారెస్పీ కాలువలు నిర్మించగా.. అదే నీటి ప్రవాహంతో పైసా ఖర్చు లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

8లో▸



'కంటివెలుగు' వినియోగించుకోండి

ఎలిగేడు: కంటివెలుగును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా అన్నారు. శివపల్లిలో వైద్యశిబిరాన్ని ప్రారంభించి 129 మందికి పరీక్షలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడి పెరుగుతుంది. ఉక్కపోత అధికమవుతుంది.

న్యూస్‌రీల్

యుడైస్ చాలా కీలకం



మాట్లాడుతున్న డీఈఓ మాధవి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, ఉపకారవేతనాల ఎంపికలో యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ (యుడైస్) సమాచారం చాలా కీలకమని డీఈవో మాధవి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, సీసీఓలకు ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు కల్పించిన వసతులు, వివరాలను హెచ్‌ఎంలు సరిగా నమోదు చేయాలన్నారు. కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, సమన్వయకర్తలు విజయ్‌కుమార్, షేక్, సురేంద్రకుమార్ తదితరులున్నారు. ప్రతి పాఠశాలలో బాలల గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన 152 పాఠశాలలకు బాలల సాహిత్యానికి చెందిన 259 పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

సెకండియర్‌లో 181 మంది గైర్హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షకు 181 మంది గైర్హాజరయ్యారని నోడల్ అధికారి కల్పన తెలిపారు. 5,943 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 5,762 మంది హాజరయ్యారని వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా సాగాయని పేర్కొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 250వ ర్యాక్ యూరియా సరఫరా



గూడ్స్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న సీజీఎం

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 250వ ర్యాక్ యూరియాను కర్మాగారం సీజీఎం సుధీర్‌కుమార్ ఝా, ఏడీఏ ఆదిరెడ్డి, సహ సంచాలకులు కాంతారావు జెండా ఊపి ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేకింగ్ ఇండియాలో భాగంగా కర్మాగారాన్ని ప్రారంభించారని, ఇందులో ఉత్పత్తి అయిన 8.06లక్షల టన్నుల యూరియాను రైల్వే లైన్ ద్వారా 250ర్యాక్‌ల యూరియాను వివిధ రాష్ట్రాలకు సరఫరా చేశామని పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం నిరసన

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఉద్యమించాల్సిన పరిస్థితులు దాపురించాయని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోచయ్య అన్నారు. ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఈ నెలాఖరు వరకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారుల దృష్టికి తెచ్చేందుకు ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిరసనలో ఉపాధ్యాయులు, పెన్షనర్లు అధికసంఖ్యలో పాల్గొనాలని రామనారాయణ, శంకర్, రాజనర్సు, రమేశ్, సాంబయ్య, తిరుపతి, కనకయ్య, సుధాకర్‌రెడ్డి కోరారు.

అభివృద్ధి పేరిట అవినీతి పాలన



మేరపల్లిలో మాట్లాడుతున్న విజయ్

పెద్దపల్లిరూరల్/కాల్వశ్రీరాంపూర్: రాష్ట్రంలో అభివృద్ధి పేరిట అవినీతి పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లి మండలం మేరపల్లిలో హాథ్‌సే హాథ్ జోడో చేపట్టారు. మేరపలిలోని పోచమ్మ గుట్టను స్థానిక ఎమ్మెల్యే అండదండలతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులు మాయంచేశారని, అనుమతి లేకుండానే మట్టి, కంకర తరలించారని పేర్కొన్నారు. ఎంపీటీసీ ఎడెల్లి శంకర్, శ్రీనివాస్, లచ్చయ్య, వెంకటేశ్, రాజు, సుధాకర్‌రెడ్డి, నెత్తెట్ల కుమార్, తిరుపతిరావు, రవి, గుర్రాల రాజు, జగదీశ్, సునిల్, విజయ్, సంతోష్, స్వామి తదితరులున్నారు.

పంట పరిహారంపై ప్రకటన చేయాలి

కాల్వశ్రీరాంపూర్: వడగండ్లతో కాల్వశ్రీరాంపూర్‌లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఇప్పలపల్లె, పెగడపల్లి, సర్వారాంపల్లి, ఆశన్నపల్లిలో పర్యటించారు. ఎకరాకు రూ.30వేలు అందించాలని డిమాండ్ చేశారు.

నూతన 'శోభ'

కరీంనగర్ కల్చరల్: మెరిసిపోయే ప్రకృతి.. గొంతెత్తి పాడే కోయిల.. మావిచిగురు, వేపపూత పరిమళాలతో పరిసరాలన్ని పరవశించే సమయం ఉగాది పర్వదినం. తిరిగిరానికాలం తీసుకొచ్చే అనుభూతులు, అనుభవాలు మనుషుల జీవితాల్లో మధురమైన జ్ఞాపకాలుగా మారుతాయి. వేప పువ్వు, బెల్లం, చింతపండు, నెయ్యి, మిరియాలు, ఉప్పు మిశ్రమాలతో షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. బుధవారం ఉమ్మడి జిల్లావాసులు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ జరుపుకోనున్నారు.





రాజ్యపూజ్యమే లక్ష్యం!

నూతన పంచాంగంలో కొత్త ఆశలతో ముందుకు..

- విజయలక్ష్మి కటాక్షానికి అన్ని పార్టీల తహతహ
- అభివృద్ధి గెలిపిస్తుందని కారుపార్టీ ధీమా
- వ్యతిరేకత విజయాన్నిస్తుందని ప్రతిపక్షాల విశ్వాసం
- జాతకాల్లో అదృష్టం వెతుక్కుంటున్న నేతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలుగువారి కొత్త సంవత్సరాది ఉగాది. శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ప్రతీ ఒక్కరూ తమ జాతకాన్ని కొత్త పంచాంగంలో వెతుక్కుంటున్నారు. ఈ ఉగాది సాధారణ ప్రజల కంటే.. రాజకీయ నాయకులకు ఎంతో కీలకమైంది. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, ప్రతిపక్షంలో ఉన్న ప్రత్యర్థులు, ఈసారి ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామనుకునే ఆశావహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అధికార–ప్రతిపక్ష నేతలంతా నూతన పంచాంగంలో తమ జాతకాలలో ఆదాయ వ్యయాల మాట ఎలా ఉన్నా.. రాజ్యపూజ్యంపైనే కన్నేశారు. అవమానాల మాట పక్కనబెట్టి.. రాజ్యపూజ్యం దక్కుతుందా? లేదా అన్న అంశంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..

సిరిసిల్ల: ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కేటీఆర్‌కు ప్రత్యర్థులు పెద్దగా లేరు. కాంగ్రెస్ నుంచి కె.కె.మహేందర్‌రెడ్డి మినహా ఇక్కడ ఆయనకు గట్టి వైరిపక్షం కానరావడం లేదు. ఈసారి బీజేపీ మాత్రం సెలబ్రిటీని రంగంలోకి దించుతారన్న ప్రచారం సాగుతోంది.

వేములవాడ: ప్రస్తుత ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ (బీఆర్‌ఎస్)కు చిరకాల ప్రత్యర్థి, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశాలున్నాయి. బీజేపీ నుంచి చెన్నమనేని విద్యాసాగర్ రావు కుమారుడు వికాస్ పేరు వినిపిస్తుండగా.. తాను స్వతంత్రంగానైనా పోటీచేస్తానని తుల ఉమ ప్రకటించారు. ఎన్నారైలు గోలి మోహన్ (నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు), మరో ఎన్నారై తోట రాంకుమార్ కూడా బరిలో నిలిచేందుకు ఆసక్తిగా ఉన్నారు.

జగిత్యాల: డాక్టర్ సంజయ్ ఇప్పటికే వరుసగా గ్రామాల్లో పర్యటిస్తూ.. పల్లె నిద్ర పేరుతో ప్రజలకు చేరవవుతున్నారు. ఇక మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి (కాంగ్రెస్) కూడా పోటాపోటీగా పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల భోగశ్రావణి బీజేపీ నుంచి బరిలోకి దిగేందుకు ఆసక్తిగా ఉన్నారు.

కోరుట్ల: ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు(బీఆర్‌ఎస్) వరుసగా అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు అంటూ పర్యటిస్తున్నారు. ఈసారి జువ్వాడి నర్సింగరావు (కాంగ్రెస్) గట్టి పోటీ ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నారు. మార్పులు జరిగితే వీరిద్దరు కుమారులను బరిలో దింపుతారన్న ప్రచారం కూడా జరుగుతోంది.

ధర్మపురి: ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)కు ఈసారి గట్టి పోటీ ఉంది. ఇక్కడ నుంచి అడ్లూరి లక్ష్మణ్ (కాంగ్రెస్), మాజీ ఎంపీ గడ్డం వివేక్ (బీజేపీ) కూడా బరిలోకి దిగుతారని ప్రచారం సాగుతోంది.

పెద్దపల్లి: ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)కి సొంత పార్టీ నుంచే తీవ్ర పోటీ ఉంది. ఎమ్మెల్యే టికెట్ కోసం.. సొంత పార్టీకే చెందిన ఎన్నారై నల్ల మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ నేత విజయరమణారావు నుంచి వీరికి గట్టి పోటీ ఎదురవనుంది. బీజేపీ నుంచి గుజ్జుల రామక్రిష్టారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. బీఎస్పీ నుంచి దాసరి ఉష బరిలో ఉన్నారు.

మంథని: ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు (కాంగ్రెస్)కు, పుట్ట మధు (బీఆర్‌ఎస్)కు ఈసారి హోరాహోరీ పోరు నడవనుంది. ఇక్కడ వీరిద్దరు మినహా మూడో పార్టీ అభ్యర్థులెవరూ ఇంతవరకూ ఆసక్తి చూపలేదు.

రామగుండం: ప్రస్తుతం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు, ఈసారి కాంగ్రెస్ నేత ఠాకూర్ మక్కాన్ సింగ్ (కాంగ్రెస్) గట్టి పోటీ ఎదురవనుంది. వీరితోపాటు సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ (బీజేపీ) కూడా బరిలో ఉండటంతో పోరు రసవత్తరంగా మారనుంది.

కరీంనగర్: మంత్రి గంగుల కమలాకర్ తీగలవంతెన, ఎమ్మార్ఎఫ్, స్మార్ట్ సిటీ పనులతో కరీంనగర్‌పై ఫోకస్ పెట్టారు. హిందుత్వం, మార్పు అన్న ఎజెండాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నుంచి పోటీ ఎదరవనుంది. బీజేపీ నుంచి కొత్త జయపాల్‌రెడ్డి కూడా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు రోహిత్, నగరాధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. వైఎస్సార్‌టీపీ నుంచి డాక్టర్ నగేశ్ బరిలో నిలవనున్నారు.

చొప్పదండి: ఎమ్మెల్యే రవిశంకర్ (బీఆర్‌ఎస్)కు ఇంటిపోరు తప్పేలా లేదు. అదేపార్టీ నుంచి గజ్జెల కాంతం, కత్తెరపాక కొండయ్య, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ టికెట్ రేసులో ఉన్నారు. ఈసారి మేడిపల్లి సత్యం (కాంగ్రెస్) నుంచి గట్టి పోటీ ఇవ్వనున్నారు. బీజేపీ నుంచి బొడిగె శోభ, సుద్దాల దేవయ్యల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వైఎస్సార్‌టీపీ నుంచి అక్కెనపల్లి కుమార్ బరిలో నిలవనున్నారు.

మానకొండూరు: ఇక్కడ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రసమయి బాలకిషన్‌కు ఈసారి ఇంటి పోరు తీవ్రంగానే ఉంది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇక్కడే నుంచే పోటీ చేసిన ఓరుగంటి ఆనంద్ కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ, బీజేపీ గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్న బరిలో నిలవనున్నారు.

హుజూరాబాద్: గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఈటల రాజేందర్ ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఈసారి బరిలో దిగనున్నారు. కాంగ్రెస్ నుంచి ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఎకరాకు రూ.40వేలు ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



ర్యాకల్‌దేవుపల్లిలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

ఎలిగేడు: వడగండ్ల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేల చొప్పున పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో వరి పొలాలు, మొక్కజొన్న రైతులతోపాటు ఇంటిపైకప్పులు లేచిపోయిన బాధితులను పరామర్శించారు. వడగండ్లతో మండలంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, కలెక్టర్ చొరవ చూపి సమగ్ర నివేదిక సేకరించి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఇంటిపైకప్పులు దెబ్బతిన్న కుటుంబాలు ఇళ్ల నిర్మాణానికి రూ.3లక్షలు ఇవ్వాలన్నారు. పార్టీ నాయకులు మీస అర్జున్‌రావు, లింగారెడ్డి, గర్రెపల్లి నారాయణస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్, గోపు సురేందర్‌రెడ్డి, మల్లారపు అంజయ్య, కొక్కొరాల దామోదర్‌రావు, గోపు మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఫసల్ బీమా చేస్తే బాగుండేది

సుల్తానాబాద్: వడగండ్లతో రైతులు ఎంతో నష్టపోయారని, ఫసల్ బీమా చేయిస్తే బాగుండేదని గుజ్జుల అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం కల్పించిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే రైతులకు మేలు జరిగేదన్నారు. సుల్తానాబాద్, ఎలిగేడు, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, పెద్దపల్లిలో సీఎం కేసీఆర్ ఏరియల్ సర్వే చేయాలని కోరారు. నాయకులు శంకర్, మహేందర్ సదయ్య, నాగరాజు, రాజు, శ్రీనివాస్ గౌడ్, పవన్ పాల్గొన్నారు.

అదానీ, అంబానీలకు ప్రధాని ఏజెంట్



కాల్వశ్రీరాంపూర్: మంగపేటలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ఓదెల/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్: ఎనిమిదేళ్ల పాలనలో బీజేపీ దేశానికి చేసిందేమీ లేదని, అదానీ, అంబానీకి ప్రధాని మోదీ ఏజెంట్‌గా మారారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఓదెల మండలకేంద్రంతోపాటు కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాల్లో మాట్లాడారు. బీజేపీ హిందుత్వం పేరిట మత విద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు కేవలం బీఆర్‌ఎస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలతో ప్రజల వద్దకు వస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచాయన్నారు. పార్టీ ఓదెల మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకదేవి, మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ మేకల మల్లేశం, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కాల్వశ్రీరాంపూర్‌లో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, ఏఎంసీ చైర్మన్ సుజాత, వైస్ చైర్మన్ సంధ్య, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రా రెడ్డి, పురుషోత్తం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజకొమురయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పిస్తాం

వడగండ్లకు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని మంత్రి ఈశ్వర్ తెలిపారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దన్నారు. సుల్తానాబాద్‌లో ఇంటిపైకప్పులు లేచిపోయిన బాధితులను పరామర్శించారు. ఎంపీపీ బాలాజీరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, తహసీల్దార్ యాకన్న, నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, ముత్యం రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ప్రత్యేక సదుపాయాలు

కోల్‌సిటీ(రామగుండం): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లలో సదుపాయాలు కల్పించామని కలెక్టర్ సంగీత తెలిపారు. గోదావరిఖని పవర్‌హౌజ్ కాలనీలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. సౌకర్యాలపై లైబ్రేరియన్ భారతి, పాఠకుల ద్వారా తెలుసుకున్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటుందని, అభ్యర్థులకు రెండు పూటలు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. కాంపౌండ్‌లో అదనపు లైటింగ్, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలని, పిచ్చిమొక్కలు పెరగకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

'ఆరోగ్యమహిళ'పై ప్రచారం చేపట్టాలి

రామగుండం: ఆబాది రామగుండంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న మహిళల ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళా కేంద్రాలపై ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్ మాధురి, కమిషనర్ సుమన్‌రావు, వైద్య సిబ్బంది ఉన్నారు.



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంగీత

క్లుప్తంగా

ముత్తారం ఠాణాను తనిఖీ చేసిన డీసీపీ



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్

రామగిరి(మంథని): ముత్తారం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌ను పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. మండల పరిధిలో ప్రధాన సమస్యలు, పంటలు, పాఠశాలలు, వైద్యం, సరిహద్దులు, రవాణా వ్యవస్థ గురించి అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. వివిధ అవసరాల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో గౌరవప్రదంగా, మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని వెంటనే వారికి తగిన విధంగా సహాయసహకారాలను అందించా లని సూచించారు. ఈ సందర్భంగా ఠాణా ఆవరణలో మొక్క నాటారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, మంథని సీఐ సతీష్, ఎస్సై రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇకనుంచి నిరంతర గ్రంథాలయాలు



సూచనలిస్తున్న మమతారెడ్డి, రఘువీర్‌సింగ్

పెద్దపల్లిరూరల్: విద్యావంతులైన నిరుద్యోగుల కోసం ఇకనుంచి గ్రంథాలయాలను రేయింబవళ్లు తెరిచే ఉంచుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని గ్రంథాలయాన్ని పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డితో కలిసి సందర్శించారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారి కోసం గ్రంథాలయాలను నిరంతరం అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అలాగే అభ్యర్థులకు రోజుకు రెండు పూటలా ఉచితంగా భోజనం అందిస్తామని వివరించారు. అనంతరం ఉచిత భోజనాన్ని అందించారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటాలి



బహుమతులు అందజేస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): క్రీడా పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయిలో సింగరేణి కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఆర్జీ–2 జీఎం మనోహర్ కోరారు. మంగళవారం రాత్రి యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన 30వ క్రీడావార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గెలుపోటములు ముఖ్యం కాదని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరంవిజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారులు మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరు.. విద్యుత్ ఉత్పత్తి



కుమ్మరికుంటలో డీ-83 కాలువపై జల విద్యుత్ కేంద్రం



విద్యుత్ ఉత్పత్తి చేసే టర్బైన్లు

- ఎస్సారెస్పీ కాలువకే తలమానికం డీ– 83 కెనాల్
- కాలువపై పది మినీ జలవిద్యుత్ కేంద్రాలు
- రోజూ 9.16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి.. నిరుద్యోగులకు ఉపాధి

జూలపల్లి(పెద్దపల్లి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటితో నాలుగు జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు కాలువలు నిర్మించగా.. అదే నీటితో పైసా ఖర్చు లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రైతులకు సాగునీరు, భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు తాగునీరు అందుతోంది. నిజామాబాద్ జిల్లాలో ప్రారంభమయ్యే ప్రధాన కాలువ చొప్పదండి మండలం రాగంపేట వద్ద మూడు భాగాలుగా విడిపోతుంది. ప్రధాన కాలువ నుంచి మూడు కాలువలుగా విభజిస్తూ డీ– 86, డీ– 83, ఎల్ఎండీకి నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్లను నిర్మించారు. ఎక్కడా లేని విధంగా డీ– 83 కాలువపైన పది మినీ జలవిద్యుత్ కేంద్రాలను జెన్‌కో నిర్మించింది. దీంతో ఖర్చు లేకుండా టర్బైన్ల ద్వారా రోజూ 9.16 మెగావాట్ల కరెంటును ఉత్పత్తి చేస్తున్నారు.

జలవిద్యుత్ కేంద్రాలున్న గ్రామాలు

డీ– 83 కాలువపై మొత్తం 10 జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. ధర్మారం మండలం కమ్మర్ ఖాన్‌పేట వద్ద (500 కిలోవాట్స్) ఒక కేంద్రాన్ని నిర్మించారు. జూలపల్లి మండలం అబ్బాపూర్ వద్ద (500 కిలోవాట్స్) 2, ఇదే మండలం కుమ్మరికుంట వద్ద (220 కిలోవాట్స్, 500 కిలోవాట్స్) 2, వడ్కాపూర్ వద్ద (325 కిలోవాట్స్) 1, పెద్దపల్లి మండలం మద్దికుంట వద్ద (500 కిలోవాట్స్) 2, చందపల్లి వద్ద (220 కిలోవాట్స్, 7.5 కిలోవాట్స్) 2 కేంద్రాలు నిర్మించారు. కాలువకు నీరు విడుదల చేసినన్ని రోజులు ప్రతి రోజూ 9.16 మెగావాట్ల కరెంటును ఉత్పత్తి చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి

డీ– 83 కాలువకే తలమానికంగా నిర్మించిన మినీ జలవిద్యుత్ కేంద్రాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయి. కరెంటు ఉత్పత్తి చేసినా, చేయకున్నా మూడు షిఫ్టుల్లో ఆపరేటర్లుగా ఐటీఐ చదివిన 60 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఇక్కడ ఉత్పత్తి అయిన కరెంటును పెద్దపల్లి వద్ద నిర్మించిన సబ్‌స్టేషన్ ద్వారా అవసరమున్న గ్రామాలకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

కార్మికుల తీర్పునకు తగిన న్యాయం చేస్తాం

- కేశోరాం కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో ఈనెల 20న జరిగిన ఎన్నికల్లో తమ ప్యానెల్‌ను ఆదరించి గెలిపించిన కార్మికుల తీర్పునకు తగిన న్యాయం చేస్తామని, సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి అన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బసంత్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లుగా కంపెనీలో అవినీతికి తావులేకుండా పాలన కొనసాగించామని, ప్రస్తుతం మూడేళ్లు కూడా అదే రీతిలో అవినీతి రహిత పాలన సాగించి కార్మికులకు సుపరిపాలన అందిస్తామని పేర్కొన్నారు. స్థానికంగా కొందరు బీఆర్ఎస్ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు తనను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అయినా తాను ఎమ్మెల్యేకు ఎప్పుడూ విధేయుడిగానే ఉంటానని స్పష్టం చేశారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ తరఫున రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే చందర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, కన్నాల సింగిల్‌విండో వైస్ చైర్మన్ కుడిక్యాల సురేశ్, నాయకులు పర్శవేని శ్రీనివాస్, పుప్పాల రమేశ్, ఈదునూరి నారాయణ, దశరథం, కుమారస్వామి, నగునూరి రమేశ్, పోతుల ప్రసాద్, పుప్పాల దయానందం, వంశీ పాల్గొన్నారు.

యూనియన్ కాలపరిమితి పెంపు సరికాదు

కేశోరాంలో పర్మినెంట్ కార్మిక సంఘం కాలపరిమితిని మూడేళ్లకు పెంచుతూ కంపెనీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం సరికాదని కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య ఆరోపించారు. మంగళవారం కేశోరాం హెచ్ఆర్ మేనేజర్ గోవిందరావు కార్యాలయంలో కార్మికులతో కలిసి చర్చలు జరిపారు. గత 20 ఏళ్లగా కంపెనీలో కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికసంఘాల కాలపరిమితి రెండేళ్లగానే ఉంటుందని, ప్రస్తుతం మూడేళ్లకు పొడిగించడం ఏంటని ప్రశ్నించారు. యాజమాన్యం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకుంటే కార్మికుల పక్షాన న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల్లో తనకు ఓటు వేసిన కార్మికులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కంపెనీ అధికారులు సదానందం, శ్యాంకుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేడు శ్రీఆదివరాహస్వామి సన్నిధిలో ఉగాది ఉత్సవాలు



ఆదివరాహస్వామి ఆలయం

కమాన్‌పూర్(మంథని): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీఆదివరాహస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఉగాది రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. కాగా ఆదివరాహస్వామి ఆలయానికి మండల కేంద్రం నుంచి పోచమ్మకుంట కట్ట మీదుగా వెళ్లే దారి విస్తరణ కోసం నిధులు మంజూరైనాయి. చేపట్టిన పనులు నేటి వరకు పూర్తి కాలేదు. దీంతో భక్తులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది.

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఏసీపీ

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివరాహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు, వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తకుండా గోదావరిఖని ఏసీపీ గిరి ప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఎండదెబ్బకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలి

గోదావరిఖని(రామగుండం): ఉద్యోగులు ఎండదెబ్బకు గురికాకుండా వేసవిలో పూర్తిస్థాయి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ సూచించారు. వేసవికాలం, రాబోయే వర్షాకాలంలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఓసీపీ మ్యాన్‌వే వద్ద చలువ పందిళ్లు, టిఫిన్, భోజన సమయాల్లో రెస్ట్ తీసుకునే ప్రాంతాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఉల్లిగడ్డలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఓసీపీ–3 ప్రాజెక్ట్ అధికారి జి.మోహన్‌రెడ్డి, వకీల్‌పల్లి ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రైలెక్కిన బస్సులు



ఓదెల(పెద్దపల్లి): సికింద్రాబాద్ నుంచి హిమాచల్‌ప్రదేశ్‌కు మంగళవారం గూడ్స్ రైలులో హిమాచల్ రోడ్ కార్పొరేషన్‌కు సంబంధించి 150 బస్సులను తరలించారు. ఈసందర్భంగా కాజీపేట్– బల్లార్షా సెక్షన్ల మధ్యలోని జమ్మికుంట, ఉప్పల్, పొత్కపల్లి, ఓదెల, కొలనూర్, పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లలోని ప్రయాణికులు సదరు బస్సులు రైలెక్కాయని చర్చించుకుంటూ ఆసక్తిగా తిలకించారు.

ఉత్తమ విద్యకు కేంద్రీయ విద్యాలయం

- ఈనెల 27నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఒకటో తరగతిలో ప్రవేశాలకు..
- ఆన్‌లైన్, యాప్ ద్వారా అవకాశం



కేంద్రీయ విద్యాలయం, రామగుండం

జ్యోతినగర్(రామగుండం): అత్యుత్తమ విద్యా బోధనకు కేంద్రీయ విద్యాలయాలు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. ఇందులో భాగంగా 2023–24 విద్యాసంవత్సరానికి విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంగ్లిష్, హిందీ మీడియంలో.. సీబీఎస్ఈ సిలబస్ బోధన అందిస్తుంది. రామగుండంలో కేంద్రీయ విద్యాలయం ఉంది.

ప్రవేశం పొందే విధానం..

- కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనికుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తారు.
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బ్యాంకు, పోస్టల్ శాఖల ఉద్యోగుల పిల్లలకు రెండో ప్రాధాన్యత ఇస్తారు.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడో ప్రాధాన్యత ఉంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలు ఆర్టీసీ, ఎన్‌పీడీసీఎల్ తదితర ఉద్యోగుల పిల్లలకు నాలుగో ప్రాధాన్యత కల్పిస్తారు.
- సాధారణ ప్రజల పిల్లలకు తుది ప్రాధాన్యత ఉంటుంది.

దరఖాస్తు విధానం..

ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. సంబంధిత వెబ్‌సైట్ kvsonlineadmission.kvs. gov.in ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లిన తర్వాత లాగిన్ అయి దరఖాస్తు నింపాలి. అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. మరోసారి పరిశీలించుకుని సబ్‌మిట్ చేసి ప్రింట్ తీసుకోవాలి. ఒక్కసారి దరఖాస్తు చేసిన తర్వాత మళ్లీ మార్పులు చేసేందుకు అవకాశం ఉండదు. kvsonlineadmission.kvs.in/ apps యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తులకు చివరి తేదీ

ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 27 నుంచి ఏప్రిల్ 17వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీలను ప్రకటించి నోటిఫికేషన్ జారీ చేస్తారు. రెండో తరగతి ఆపైన అడ్మిషన్లకు 03-04-2023 నుంచి 12-04-2023 వరకు (ఆఫ్‌లైన్) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ జాబితాను 17-04-2023న విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఏప్రిల్ 18 నుంచి 29వరకు ప్రవేశాలు కల్పిస్తారు. 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, సింగల్ గర్ల్ చైల్డ్‌కు లాటరీ ద్వారా కేటాయిస్తారు. దివ్యాంగులకు 3 శాతం, ఓబీసీలకు 27 శాతం, సీట్లను కేటాయిస్తారు. రెండో తరగతి నుంచి 11వ తరగతి వరకు విద్యాలయంలో ఉన్న ఖాళీలను బట్టి ప్రవేశాలు కల్పిస్తారు.

'ట్రినిటి'లో సయోనోరా 2కే23



విద్యార్థుల నృత్య ప్రదర్శన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లొమా విద్యార్థులు మంగళవారం సయోనోరా 2కే23 పేరిట వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ట్రాఫిక్ సీఐ అనిల్ అన్నారు. విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహిస్తున్నామని అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏఓ సురేశ్, రాజిరెడ్డి, నటరాజన్, ప్రభాకర్, పద్మిని, వంశీ తదితరులున్నారు. కాగా ట్రినిటి విద్యాసంస్థల్లో మంగళవారం ముందస్తు ఉగాది పర్వదిన వేడుకలను జరుపుకున్నారు. సీబీఎస్సీ పాఠశాల, బీఈడీ కాలేజీ, ప్రైమరీ పాఠశాల, కాసులపల్లిలోని ట్రినిటి పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు.

కస్తూర్బా విద్యార్థినుల క్షేత్ర పర్యటన



క్షేత్ర పర్యటనలో విద్యార్థినులు

రామగుండం: అంతర్జాతీయ అడవి దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రామగుండం కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులు క్షేత్ర పర్యటనకు తరలివెళ్లారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో వనదర్శిని కార్యక్రమం చేపట్టగా, అడవులపై అవగాహన, లాభాలు, వినియోగాలు, అడవి సంపద సృష్టి, అడవి ఉత్పత్తులు తదితర అంశాలపై వంద మంది విద్యార్థినులను కన్నాల అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ముఖ్యంగా అడవుల్లో చెక్‌డ్యాంలు, కందకాల తవ్వకాలు తదితర వాటితో ఒనగూరే ప్రయోజనాలు, అడవుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, అడవుల్లో జంతువులకు ఏర్పాటు చేసే సౌకర్యాలు, అక్కడక్కడ నీటి గుంతల ఏర్పాటు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో అడవిలో వంద మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సీహెచ్.నర్సయ్య, ఎండీ.హసన్‌ఖాన్, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేకాధికారి కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు కృషి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న తమ యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జీడీకే–5 ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యలపై డిబేట్‌కి సిద్ధమా అని ప్రశ్నించారు. ఆరోపణలు వెనక్కి తీసుకోకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతంలోనూ ఏఐటీయూసీ నాయకునిపై వచ్చిన వార్తను చూపిస్తూ సీఐటీయూ పేరు చెబుతూ విమర్శించారన్నారు. సింగరేణిలో కార్మిక సంఘాల ఐక్యత కోసం కార్మికుల గెలుపు కోసమే రెండు ఓట్ల విధానం, రెండు సంవత్సరాల కాలపరిమితితో ఎన్నికలు జరగాలన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్న కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చాలన్నారు. హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు గెలవాలని పోరాడుతున్నామని, కార్మికులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మెండె శ్రీనివాస్, మహేష్, గౌస్, శివరాంరెడ్డి, సమ్మిరెడ్డి, ప్రవీణ్, మల్లేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు బాధ్యతగా పాటించాలి



కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రమేశ్

రామగిరి(మంథని): విధుల్లో భద్రత పద్ధతులు, రక్షణ సూత్రాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ అధికారి ఎస్.రమేశ్ సూచించారు. మంగళవారం స్థానిక సివిల్ విభాగం కార్యాలయ ఆవరణలో భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా ఈనెల 13 నుంచి 21 వరకు సివిల్ భద్రత వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ శంకరయ్య, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పోద్దార్, సివిల్ ఎస్ఈ పద్మరాజు, డీవైపీఎం కావూరి మారుతి, సివిల్ అధికారులు రామకృష్ణ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై అవగాహనతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): రక్షణపై ప్రతిఒక్కరూ అవగాహనతో ముందుకెళ్లాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. మంగళవారం సివిల్ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రక్షణ పరికరాలు నిత్యం ధరిస్తూ విధులు నిర్వహించాలన్నారు. రక్షణతో పాటు మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ రీజియన్ జీఎం ఎస్.సాంబయ్య, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, సివిల్ డీజీఎం ధనుంజయ, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ పాల్గొన్నారు.